


నేటి పత్రిక
# ప్రజా వార్త
NETI PATRIKA PRAJA VARTHA
తెలుగు వారపత్రిక



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి.. చదవండి.. చెప్పండి..



విజయవాడ | తేదీ: 8 - 15 జూన్ 2023 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 52 | పేజీలు : 4, వెల: రూ.5


## జమ్మూలో శ్రీవారి ఆలయం ప్రారంభం..

### దర్శనానికి పోటెత్తిన భక్తజనం..



**జమ్మూ, నేటి పత్రిక ప్రజావార్త :**

జమ్మూలో శ్రీవారి ఆలయ మహా సంప్రోక్షణం ఘనంగా జరిగింది. జమ్ము లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా టీటీడీ ఆలయాలన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, జితేంద్రసింగ్‌తో పాటు టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. తొలిరోజే స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. జమ్మూలోని మాజిన్ గ్రామంలో స్వామి వారి ఆలయాన్ని టీటీడీ సర్వాంగసుందరంగా నిర్మించింది. 30 కోట్ల వ్యయంతో 62 ఎకరాల్లో ఆలయాన్ని నిర్మించారు. అందమైన శివాలిక్ అడవుల మధ్య శ్రీ వేంకటేశ్వర ఆలయం భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఈ ఆలయం జమ్మూ ప్రాంతంలోని అతిపెద్ద దేవాలయాలలో ఒకటి. జమ్మూలోని ఈ గుడి ఆంధ్రప్రదేశ్ వెలుపల నిర్మించిన ఆరో శ్రీ వేంకటేశ్వర ఆలయం. మిగతా ఐదు ఆలయాలను తిరుమల తిరుపతి దేవస్థానం హైదరాబాద్, చెన్నై, కన్యాకుమారి, ఢిల్లీ, భువనేశ్వర్‌లలో నిర్మించింది. రాయ్‌పూర్, అహ్మదాబాద్‌లలో కొత్త ఆలయాలు కూడా నిర్మించనుంది. జమ్మూలో శ్రీ వేంకటేశ్వర్ ఆలయాన్ని భక్తుల కోసం ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చామని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమలలో అనుసరిస్తున్న విధానం, ఆచారాన్ని జమ్మూ ఆలయంలో కూడా అనుసరిస్తామన్నారు. ఈ పవిత్ర స్థలంలో తిరుపతి బాలాజీ ఆలయాన్ని టీటీడీ నిర్మించిందని తెలిపారు. కాగా.. ఆ ఆలయ ప్రాంగణంలో టీటీడీ ప్రధాన ఆలయ సముదాయంతో పాటు ఉపాలయాలు, పోటు కిచెన్ ఏరియా, అన్నప్రసాదం కౌంటర్లు తదితరాలను నిర్మించింది.

## ఏపీలో ప్రతి మండలానికి
# రెండు జూనియర్ కాలేజీలు'

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

విద్యాశాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్ష చేపట్టారు. సమావేశానికి మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ జవహర్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. విద్యాశాఖలో చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలు తీరును, వాటి పురోగతిని సీఎంకు అధికారులు వివరించారు.

ఈ ఏడాది అన్ని తరహా ప్రభుత్వ స్కూళ్లలో టాప్-10 ర్యాంకులను 64 మంది విద్యార్థులు సాధించారని అధికారులు తెలిపారు. స్కూళ్లలో పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండేలా, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ అమలు జరిగేలా బదిలీలు చేపడుతున్నామని, యూనిట్ టెస్టుల్లో వెనకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి మరింత బోధన, శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాలు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని తరహా ప్రభుత్వ కాలేజీలలో టాప్-10 ర్యాంకులను 27 మంది విద్యార్థులు సాధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీలు ఉండేలా చూసుకోవాలి. ఒకటి బాలికలకు, రెండోది కో-ఎడ్యుకేషన్ ఉండాలి. జనాభా అధికంగా ఉన్న ఆ మండలంలోని రెండు గ్రామాలు లేదా, పట్టణాల్లో రెండు హైస్కూల్స్‌ను ఏర్పాటుచేసి వాటిని జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలి. వచ్చే జూన్ నాటికి ఈ జూనియర్ కళాశాలలు ఏర్పాటయ్యేలా చూడాలి. నాడు-నేడు ద్వారా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలి. సరిపడా సిబ్బందిని అక్కడ నియమించాలన్నారు.

వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యాకానుక కార్యక్రమం. సీఎం ఆదేశాల మేరకు విద్యాకానుక నాణ్యత విషయంలో అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్నామని అధికారులు అన్నారు. నాణ్యత పాటించేలా క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాతో నిర్ధారణ పరీక్షలు. ఇప్పటికే 93 శాతం విద్యాకానుక వస్తువులను నిర్దేశిత కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంచేశారు. సీఎం ఆదేశాలమేరకు పుస్తకాలన్నింటినీ కూడా సిద్ధంచేశామన్న అధికారులు. రెండో సెమిస్టర్ పుస్తకాలు అన్నీకూడా ముందుగానే ఇచ్చేందుకు సిద్ధం చేశామని అధికారులు అన్నారు.

మొదటి దశ నాడు-నేడు పూర్తిచేసుకున్న స్కూళ్లలో ఆరోతరగతి పైబడిన తరగతుల్లో ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ఏర్పాటుపై సీఎం సమీక్షించారు. ప్యానెల్స్ వినియోగంపై టీచర్లకు శిక్షణ కార్యక్రమాలపై సీఎం ఆరా తీశారు. ప్యానెల్స్‌ను ఎలా వినియోగించాలన్నదానిపై వీడియో కంటెంట్ టీచర్లకు పంపించాలని సీఎం అన్నారు.

కంపెనీల ప్రతినిధులు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫ్యాకల్టీలకు శిక్షణ ఇస్తారని, వీరిద్వారా టీచర్లకు శిక్షణ ఇస్తామని అధికారులు అన్నారు. మరింత మందికి దీనిపై నైపుణ్యం పెంచేలా 20వేల మంది బీటెక్ స్టూడెంట్స్ ఇంటర్న్‌షిప్ చేస్తారని అధికారులు వెల్లడించారు. వీరు ప్రతినెలా వెళ్లి.. టీచర్లకు ఐఎఫ్‌పీ ప్యానెల్స్ వినియోగంలో సహాయకారిగా ఉంటారని అధికారులు తెలిపారు. ఐఎఫ్‌పీలతో పాటు స్మార్ట్ టీవీల వినియోగం, ట్యాబులు, బైజూస్ యాప్‌పైనా టీచర్లకు శిక్షణ అందిస్తామని అధికారులు అన్నారు. రోజువారీగా, పాఠ్యాంశాలవారీగా బోధనపై స్కూళ్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్లు. అన్ని స్కూళ్లలో ఒకేలా బోధనకోసం ఇది ఉపయోగపడేలా తీర్చిదిద్దామనిఅధికారులు అన్నారు.



ట్యాబ్‌ల వినియోగంపై సీఎం సమీక్షించారు. ట్యాబ్‌ల నిర్వహణ, వినియోగంపై సీఎం ఆదేశాలమేరకు నిరంతరం సమీక్షలు చేస్తున్నామని అధికారులు అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిజిటల్‌అసిస్టెంట్లు ఈ బాధ్యత చూస్తున్నారని అధికారులు తెలిపారు.

అన్ని స్కూళ్లలో ఇంటర్నెట్ సదుపాయంపై సీఎం సమీక్షించారు. సుమారు 45వేల స్కూళ్లలో ఇంటర్న్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు నిర్ణయం. ఏపీఎస్‌ఎఫ్‌ఎల్, బీఎస్‌ఎన్‌ఎల్ ద్వారా స్కూళ్లకు ఇంటర్నెట్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులన్నారు. తొలిదశ నాడు నేడు పూర్తి చే సుకున్న స్కూళ్లలో ఇంటర్‌నెట్ సౌకర్యం అందించే కార్యక్రమం పూర్తయిందన్నారు. సెప్టెంబరు నెలాఖరుకల్లా అన్ని స్కూళ్లకు ఇంటర్నెట్ సదుపాయం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు అన్నారు. నాడు-నేడు రెండోదశ కింద చేపట్టిన పనుల ప్రగతిని సీఎం సమీక్షించారు. నాడు-నేడు రెండో దశ కింద ఇప్పటికే రూ.3,287.08 కోట్లు ఖర్చు చేశామని అధికారులు వెల్లడించారు. 22,224 స్కూళ్లలో రెండోదశ నాడు -నేడు పనులు. డిసెంబరు నాటికి పనులు పూర్తవుతాయని అధికారులన్నారు. నాడునేడు కింద పనులు పూర్తిచేసుకున్న స్కూళ్లలో అదే సమయానికి ట్యాబులు పంపిణీతో పాటు, ఐఎఫ్‌బీ ప్యానెల్స్ ఏర్పాటు పూర్తికావాలని సీఎం అన్నారు. ప్రతి బాలుడు, బాలిక తప్పనిసరిగా స్కూల్లో చేరాలని, 100శాతం జీఈఆర్ సాధించే దిశగా ముందుకు సాగాలని సీఎం ఆదేశించారు. డ్రాప్‌అవుట్స్ లేకుండా అన్నిరకాలుగా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రాపౌట్స్ నివారణకు గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల సహకారం తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు. పదోతరగతి, 12వ తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు తిరిగి అడ్మిషన్ ఇచ్చి వారిని ముందుకు నడిపించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులన్నారు. గోరుముద్ద, ఎస్ఎంఎఫ్, టీఎంఎఫ్‌ల పై నిరంతరం ఫీడ్‌బ్యాక్ తెప్పించుకోవాలని సీఎం అన్నారు. ఫీడ్‌బ్యాక్ ఆధారంగా నిరంతరం చర్యలు తీసుకోవాలన్నారు. థర్డ్‌పార్టీ వెరిఫికేషన్ ఉండాలన్నారు. ?ఇంటర్మీడియట్లో కూడా బైజూస్ కంటెంట్ పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. తర్వాత దశలో ట్యాబులు పంపిణీకి కూడా సన్నద్ధంగా ఉండాలన్నారు. దీనికోసం ఇప్పటినుంచే సరైన ప్రణాళికతో ముందుకు పోవాలన్నారు. కేజీబీవీల్లో కూడా ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. అకడమిక్ స్ట్రెంగ్త్ కోసం పనిచేయాలని సీఎం అన్నారు. జూన్ 12న తిరిగి ప్రారంభం పాఠశాలలు కానున్నాయి. ముఖ్యమైన అంశాలతో పాటు స్కూల్ కాంప్లెక్స్ షెడ్యూల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల విధులు, లాంగ్వేజ్ మేళా, లాంగ్వేజ్ క్లబ్, లాంగ్వేజ్ ల్యాబ్స్, లెసన్ ప్లాన్ ఫార్మాట్ అండ్ గైడ్‌లైన్స్, లెర్న్ ఏ వర్డ్ ఏ డే, తెలుగు భాషా వారోత్సవాలు, కల్చరల్ యాక్టివిటీస్‌తో సహా స్కూళ్లలో చేపట్టాల్సిన పలు అంశాలతో అకడమిక్ క్యాలెండర్‌ను అధికారులు రూపొందించారు.

2023లో టెన్త్, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభావంతులకు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు. జగనన్న ఆణిముత్యాలు పేరుతో విద్యార్థులకు ఇవ్వనున్న మెడల్స్ సీఎం పరిశీలించారు. స్టేట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023 లను ప్రభుత్వం అందించనున్నది. మూడు దశలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను సత్కారం. నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను జూన్ 15న, జిల్లా స్థాయి లో జూన్ 17, రాష్ట్ర స్థాయిలో జూన్ 20న అవార్డులు ప్రభుత్వం అందజేయనున్నది. రాష్ట్ర స్థాయి అవార్డులు ముఖ్యమంత్రి అందించనున్నారు.

## బీజేపీయేతర పార్టీలను ఏకంచేసే పనిలో నితీష్ ముందడుగు

### -పాట్నాలో ప్రతిపక్ష పార్టీల ఐక్యతా సమావేశానికి ముహుర్తం ఖరారు



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

బీజేపీయేతర పార్టీలను ఏకం చేసేందుకు బీహార్ సీఎం నితీశ్‌కుమార్ తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెల ముంబయిలో పర్యటించిన నితీష్.. ఎన్సీపీ అధినేత శరద్ పవార్, శివసేన (ఉద్ధవ్ వర్గం) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేలను కలిశారు. అలాగే కొల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, లక్నోలో అఖిలేష్ యాదవ్‌లను నితీష్ కుమార్ కలిశారు. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమిపై వారితో చర్చించి.. సార్వత్రిక ఎన్నికలపై అన్ని రాజకీయపార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. వరుసగా మూడోసారి అధికార పగ్గాలు సొంతం చేసుకోవాలని కమలనాథులు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వస్తాయని.. బీజేపీ గద్దె దిగడం ఖాయమని అమెరికా పర్యటనలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తంచేశారు. బీజేపీని ఇంటికి సాగనంపే సత్తా ప్రతిపక్ష కూటమికి ఉందన్న ఆయన.. దీనికి సంబంధించి అన్ని ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమి ఏర్పాటుకు సంబంధించి కాంగ్రెస్ నేతలతో పాటు ఇతర విపక్ష నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమిపై వారితో చర్చించి.. పాట్నాలో నిర్వహించే ప్రతిపక్ష పార్టీల సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానించారు. అటు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతోనూ సమావేశమై ప్రతిపక్ష కూటమి ఏర్పాటుపై చర్చించారు. నితీష్ కుమార్ వెంట ఆర్జేడీ నేత, బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వి ప్రసాద్ యాదవ్ కూడా ప్రతిపక్ష నేతలను కలిశారు. ఈ నేపథ్యంలో ఐక్య విపక్ష కూటమి ఏర్పాటు దిశగా మరో ముందడుగు పడనుంది. పాట్నాలో నితీష్ నిర్వహించనున్న ప్రతిపక్ష పార్టీల ఐక్యతా సమావేశానికి ముహుర్తం ఖరారయ్యింది. జూన్ 23న నీతీష్ కుమార్ నిర్వహించనున్న ఈ సమావేశానికి.. వీలయినంత ఎక్కువ పార్టీలను ప్రతిపక్ష కూటమి కిందకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీ సీఎం అర్విండ్ కేజ్రీవాల్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు హాజరవుతారని తెలుస్తోంది.

జాతీయ స్థాయిలోనూ బీజేపీయేతర పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చే లక్ష్యంతో ఇప్పుడు పనిచేస్తున్నట్లు చెప్పారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి గట్టిపోటీ ఇచ్చే అంశంపై విపక్ష నేతలు చర్చించనున్నారు. బీజేపీ వ్యతిరేక ఓటు విపక్షాల మధ్య చీలిపోతే బీజేపీ గెలిచే అవకాశం ఉంటుంది.. అందుకే కనీసం 450 లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీని ఢీకొనే ప్రతిపక్ష అభ్యర్థి ఒక్కరు మాత్రమే బరిలో నిలిచేలా చూడాలని భావిస్తున్నారు. తద్వారా బీజేపీ విజయావకాశాలను అడ్డుకోవచ్చని భావిస్తున్నారు. పాట్నాలో ఈ అంశంపై ప్రతిపక్ష నేతలు ప్రధానంగా చర్చించే అవకాశముంది. ఈ ప్రతిపాదన మేరకు కాంగ్రెస్-బీజేపీ మధ్య ప్రధాన పోటీ ఉండే రాష్ట్రాల్లో ఇతర విపక్ష అభ్యర్థులు ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటారు. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో బీజేపీపై కాంగ్రెస్ పోటీ చేయకూడదు. దీంతో అక్కడ బీజేపీ-ప్రాంతీయ పార్టీల మధ్యే ప్రధాన పోటీ నెలకొంటుంది. అయితే కేరళా తదితర కొన్ని రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలే ప్రధాన రాజకీయ ప్రత్యర్థులుగా ఉంటే అక్కడ ఈ అవగాహన సాధ్యంకాకపోవచ్చని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

# 12న మోగనున్న బడి గంట

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయని, అదే రోజున విద్యార్థులకు విద్యా కానుకను అందించనున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలలు పున: ప్రారంభ రోజునే విద్యా కానుకలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ. 1100 కోట్లు ఖర్చు పెట్టి విద్యార్థులకు యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్ట్, స్కూల్ బ్యాగ్, బైలింగ్వల్ టెక్ట్స్ బుక్స్, వర్క్‌బుక్స్, డిక్షనరీ అందిస్తున్నామని తెలిపారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యా కానుకను లాంచనంగా ప్రారంభిస్తారన్నారు.

ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతూ పదవ తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపి ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థుల అభినందన కార్యక్రమం ఈ నెల 20న రాష్ట్ర స్థాయిలో మన ముఖ్యమంత్రి చేతుల మీదుగా నగదు పురష్కారం, సర్టిఫికెట్, మెమోంటోలను విద్యార్థులకు అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులను, ప్రధానోపాధ్యాయులను సత్కరించి ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, మెడల్, సర్టిఫికెట్ అలాగే జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారికి వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.15వేలుతో పాటు మెడల్, సర్టిఫికెట్, అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేలు అందిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలోని 45 వేల పాఠశాలల్లో నాడు-నేడులో భాగంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్ లు అందించనున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీ పడేలా ఇంగ్లీషులో పూర్తి పట్టు సాధించటానికి ప్రాథమిక స్థాయిలో, హై స్కూల్ విద్యార్థులకు డిక్షనరీలను అందించటమే కాకుండా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రిన్స్ టన్ యూనివర్సిటీ సహకారంతో తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. రోజుకో మెనూతో 15 రకాల వెరైటీలతో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం, ఐరన్ లోప నివారణకు వారానికి మూడు రోజులు చిక్కి, మరో మూడు రోజులు రాగిజావ అందిస్తున్నట్లు చెప్పారు. అమ్మఒడి పథకంలో భాగంగా ఈనెల 28న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో అమ్మఒడి నగదును జమ చేయనున్నట్లు మంత్రి బొత్స సత్యానారాయణ తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశంగా రెగ్యులర్‌గా మరో ఏడాది చదివే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంగ్లీషు మీడియం అమలు చేయనున్నామన్నారు. మూడవ తరగతి నుంచే ఇంగ్లీషుకు ప్రత్యేక ఉపాధ్యాయులను ఏర్పాటు చేశామని, ప్రతి విద్యార్థి ఇంగ్లీషును అర్థం చేసుకుని మాట్లాడేలా తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్య కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు, పాఠశాల విద్యా కమీషనర్ ఎస్.సురేష్‌కుమార్, పాఠశాల మౌలిక సదుపాయాల కమీషనర్ కాటంనేని భాస్కర్, సమగ్రశిక్షా అభియాన్ పీడీ శ్రీనివాసరావు, మధ్యాన్న భోజన పథకం సంచాలకులు డాక్టర్ నిధి మీనా, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ దివన్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు డి.దేవానందరెడ్డి, ఏపీఆర్ఐఈఎస్ సెక్రటరీ ఆర్.నరసింహరావు, ఎస్సీఈఆర్టీ డైరక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎస్ ఉభయ ప్రయోజనకరం : మంత్రి చెల్లుబోయిన



**సచివాలయం, నేటి పత్రిక ప్రజావార్త :**
ఏపీలో 6,840 కొత్త పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపినట్టు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ స్పష్టం చేశారు. అలాగే, నర్సాపురం ఫిషరీస్ కాలేజ్ అండ్ యూనివర్సిటీకి 140 పోస్టులకు, 476 గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో నైట్ వాచ్‌మెన్ పోస్టులకు 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఇక, సీపీఎస్ విధానం రద్దు చేసి జీపీఎస్‌కు ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. కాగా, మంత్రి చెల్లుబోయిన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎస్ ఉభయ ప్రయోజనకరం. హెచ్‌ఆర్ఏను 12 శాతం నుంచి 16శాతానికి పెంచాం. కొత్త మెడికల్ కాలేజీల్లో 2,118 సహా మరికొన్ని శాఖల్లో పోస్టులు, సీతానగరం పీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు 23 పోస్టులకు కేబినెట్ ఆమోదం. ప్రతీ మండలంలో 2 జూనియర్ కాలేజీలకు ఆమోదం. కడప మానసిక వైద్యశాలలో 116 పోస్టులకు కేబినెట్ ఆమోదం. 3వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపునకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కో-ఆపరేటివ్ సొసైటీల్లో సూపర్ న్యూమరీ పోస్టుకు ఆమోదం. చిత్తూరు డెయిరీకి 28.35 ఎకరాల భూమికి 99 ఏళ్లకు లీజుకు నిర్ణయం. విశాఖ మానసిక వైద్యశాలలో 11 పోస్టుల మంజూరు. ఇక, ఒడిశా మృతులకు కేబినెట్ సంతాపం తెలిపినట్టు వెల్లడించారు. బాధితుల కోసం 50 అంబులెన్స్‌లు పంపించినట్టు తెలిపారు. మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియాకు ఆమోదం తెలిపిందన్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలో విండ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్టు స్పష్టం చేశారు. ఈనెల 12 నుంచి విద్యాకానుక పంపిణీకి నిర్ణయం. ఈనెల 28 నుంచి అమ్మఒడి పథకం అమలుకు నిర్ణయం. నాడు-నేడు కింద పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నైట్ వాచ్‌మెన్ పోస్టులకు ఆమోదం. జగనన్న ఆణిముత్యాలు పథకం అమలుకు ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. రూ. 5లక్షల లోపు ఆదాయం ఉన్న దేవాలయాలను కమిటీలకు అప్పగింత. ఈ ఆలయాల నిర్వహణ బాధ్యత అర్చకులదే. ఐదేళ్ల పాటు ఈ నిర్ణయం అమలులో ఉంటుంది. పాడి రైతులకు సరైన ధర కల్పించాం. ఇవాళ పాల సేకరణ పెరిగింది. పాల ధర పెరిగింది. అమూల్ రావడం వల్ల పాడి రైతులకు మేలు జరిగింది. ఉద్యోగులందరికీ ఏరియర్స్‌తో 2.73 శాతం డీఏకు ఆమోదం తెలిపినట్టు స్పష్టం చేశారు.

## 50 శాతం రూ.2 వేల నోట్లు వెనక్కి వచ్చేశాయి.. ఆర్బీఐ కీలక ప్రకటన



**న్యూఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఇటీవల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొందరు డబ్బులు మార్చుకునేందుకు బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తున్నారు. మరికొందరు ఇంకా టైం ఉందిలే ఇంటూ కొంచెం ఆలస్యం చేస్తున్నారు. ఇటీవల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొందరు డబ్బులు మార్చుకునేందుకు బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తున్నారు. మరికొందరు ఇంకా టైం ఉందిలే ఇంటూ కొంచెం ఆలస్యం చేస్తున్నారు. అయితే నోట్ల బదిలీకి ఆర్బీఐ సెప్టెంబర్ 30 వరకు గడువిచ్చింది. ఇప్పుడు తాజాగా రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఇప్పటికే చలామనిలో ఉన్న రూ.2 వేల నోట్లలో 50 శాతం నోట్లు వెనక్కి వచ్చేశాయని పేర్కొంది. నోట్ల ఉపసంహరణ ప్రకటించిన 20 రోజుల్లోపే ఇది సాధ్యమైందని తెలిపింది. ఇప్పటివరకు వెనక్కి వచ్చిన ఈ 50 శాతం నోట్ల విలవ రూ.1.82 లక్షల కోట్లని వెల్లడించింది.

వీటిలో దాదాపు 85 శాతం ఓట్లు బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం వల్లే వచ్చాయని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. మార్చి 31 నాటికి రూ.2 వేల నోట్లు రూ.3.62 లక్షల కోట్లు చలామనిలో ఉన్నట్లు తెలిపారు. ఇప్పుడు సగం నోట్లు వచ్చేశాయన్నారు. అయితే సెప్టెంబర్ 30 వరకు చివరి తేది ఉన్నందున్న చివరి సమయంలో నోట్లు డిపాజిట్ లేదా మార్చుకోవడం చేయొద్దని సూచించారు. నోట్ల మార్పిడి కోసం రిజర్వ్ బ్యాంక్‌లో సరిపడా కరెన్సీ అందుబాటులో ఉందని స్పష్టం చేశారు.

## క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో మరో ముందడుగు



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధృడ సంకల్పం. ఈ లక్ష్యంతో చిన్న మున్సిపాలిటీల్లోనూ చెత్త సేకరణకు పర్యావరణహితంగా ఉండే విద్యుత్తు ఆటోలను (ఈ-ఆటోలను) ప్రవేశపెట్టారు. తద్వారా ఆ మున్సిపాల్టి లకు నిర్వహణ భారం కూడా తగ్గుతుంది. గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి వీటిని ప్రారంభించారు. రూ.4.10 లక్షల విలువైన 516 ఈ-ఆటోలను మొత్తం రూ.21.18 కోట్ల వ్యయంతో కొనుగోలు చేశారు. వీటిని 36 మున్సిపాల్టి లకు పంపిణీ చేస్తారు. ఈ ఆటో సామర్థ్యం 500 కిలోలు. మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తూ 'ఈ-ఆటోల' డ్రైవర్లుగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఇప్పటికే రూ.72 కోట్లతో 123 మున్సిపాలిటీల్లోని 40 లక్షల కుటుంబాలకు తడి, పొడి, హానికర వ్యర్థాల సేకరణకు నీలం, ఆకుపచ్చ, ఎరుపు రంగుల్లోని 120 లక్షల చెత్త బుట్టలను ప్రభుత్వం పంపిణీ చేసింది. గ్రేడ్-1 ఆపై మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు 2,525 పెట్రోల్, డీజిల్, సీఎన్జీ గార్బేజ్ టిప్పర్లను వినియోగిస్తోంది. అలాగే గుంటూరు, విశాఖపట్నంలలో వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు ప్రారంభించింది. త్వరలో రోజుకు 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో మరో ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. రూ.157 కోట్లతో 81 మున్సిపాలిటీలలో 135 గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు నిర్మిస్తున్నారు. 71 సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులు, తడి చెత్త నిర్వహణకు 29 వేస్ట్ టు కంపోస్ట్, నాలుగు బయో మిథనేషన్ ప్రాజెక్ట్‌లు నడుస్తున్నాయి. లక్ష లోపు జనాభా ఉన్న 66 మున్సిపాలిటీల్లో రూ.1,445 కోట్లతో 206 టీపీఐఎస్‌లు, లక్ష లోపు జనాభా ఉన్న 55 మున్సిపాలిటీల్లో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా చిన్న మున్సిపాలిటీల్లో



## యోగ శక్తితో సమగ్ర ఆరోగ్యం : మాకాల సత్యనారాయణ



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం స్థానిక గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న యోగ శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగ శక్తితో సమగ్ర ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. ఇది భారతీయులు వేలాది సంవత్సరాల నుండి వాడుతున్న అతి పురాతన ఆరోగ్య విధానం. దీనిని యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిపాదనను అంగీకరించి ప్రపంచమంతా దీనిని గుర్తించేలా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. యోగాలో 5 కోశాలు ఉంటాయని అందులో 1) అన్నమయ కోశ,2) ప్రాణమయ కోశ, 3) జ్ఞానమయ కోశ, 4) మనోమయ కోశ, 5) ఆనందమయ కోశ అని 5 కోశాలు ఉంటాయని తెలిపారు. అందులో రెండవది ప్రాణమయ కోశ అతి ముఖ్యమైనది. అంతర శక్తి,, బాహ్య శక్తి, మరియు చక్రాలను నిర్వహణ ద్వారా బాడీ మైండ్ సోల్ మీద ఆరోగ్యం ఆధారపడుతుందన్నారు. దీనిని చైనాలో 'ఛీ' అని పేరు పెట్టి స్కూల్స్ మరియు కాలేజీలు ఏర్పాటు చేసి బాగా అభివృద్ధి పరిచిందని తెలిపారు. భారతదేశంలో ప్రజలు దీనిని సంప్రదాయం, ఆచారం, పేరు మీద ఆచరిస్తూ ఉత్తమ ఫలితాలు పొందుతున్నారని తెలిపారు. కానీ భారత ప్రభుత్వం సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో యోగ ప్రాణ శక్తి విధానాలను ప్రపంచానికి అందించడం వెనకబాటుతనం కనపడుతుందని తెలిపారు.

యోగ సాధనలో ప్రాణమయ కోశను ప్రోత్సాహంతో ఉత్తమ ఫలితాలను పొందవచ్చునని తెలిపారు. తమ యోగ సాధన సమితి ప్రజలలో యోగ సాధనలో ప్రాణమయ కోశకు ప్రాధాన్యత పెంచేందుకు కృషి చేస్తుందని తెలిపారు. యోగా డే జూన్ 21 వరకు ప్రభుత్వం మరియు ప్రైవేట్ కళాశాలలో యోగాశక్తి చికిత్స అవగాహన మరియు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ యోగ డే రోజున ఉత్తమ యోగారత్న మరియు సేవారత్న అవార్డులతో యోగ సాధనకు, మరియు ప్రోత్సహించిన వారికి సత్కరించాలని, నిర్ణయించినట్లు డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు .ఈ కార్యక్రమంలో భూతపాటి ఉదయ్ కుమార్, యోగా గురువు కృష్ణ, నారగాని ప్రసాద్, మాచూరి శ్రీరామమూర్తి, షేక్ అ(షఫున్నిస, తలపాటి చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవానికి సొంత ఇంటి కల నిజం చేయడమే సీఎం జగన్ లక్ష్యం : మంత్రి తానేటి వనిత



**తణుకు, నేటి పత్రిక ప్రజావార్త :**
తణుకు మండలం దువ్వ గ్రామంలో జగనన్న కాలనిలో కోలపల్లి ఉమా శిరీష శివప్రసాద్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గురువారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు తో కలిసి హోంమంత్రి పాల్గొని ప్రారంభించారు. జగనన్న కాలనీలో అన్ని వసతులతో ఇంటిని సమకూర్చుకున్నామని లబ్దిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. ప్రతి పేదవాని సొంత ఇంటి కల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇంటిని ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మహిళల పేరిట ఇంటి పట్టాలు ఇవ్వడమే కాకుండా ఇల్లు నిర్మించుకోవడానికి తగిన ఆర్థిక సహాయం ఉచితంగా జగనన్న ప్రభుత్వమే అందిస్తుందన్నారు. దువ్వ జగనన్న కాలనీలో మొత్తం 731 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని వాటిలో 600కి పైగా ఇల్లు ఇప్పటికే పూర్తయ్యాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హోంమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడ్డా సూర్యనారాయణ మూర్తి (బాబు), సొసైటీ ప్రెసిడెంట్ జంపన వెంకటకృష్ణంరాజు, తణుకు ఎంపీపీ రుద్ర ధనరాజు, కోలపల్లి సూర్యారావు, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి : విజయసాయిరెడ్డి



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ అనుబంధ విభాగాలైన మహిళ, యువజన, విద్యార్థి విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులతో ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో పార్టీ అనుబంధ విభాగాల జోనల్ స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అనుబంధ విభాగాల జిల్లా, మండల, రాష్ట్రస్థాయి కమిటీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సవివరంగా వివరించాలని చెప్పారు. పార్టీ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ అనుబంధ విభాగాలకు భాగస్వామ్యం కల్పించే విధంగా చూస్తామన్నారు. సీఎం జగన్ విద్య, వైద్య వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు, మార్పులను అందరికీ తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ విద్యార్థి విభాగం సమావేశంలో విజయసాయిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. గతంలో విద్యా వ్యవస్థ ఎలా ఉంది? ఈ నాలుగేళ్లలో సీఎం జగన్ తీసుకొచ్చిన సంస్కరణలను అందరికీ వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేయాలని, 2019కి ముందు విద్యార్థి విభాగంలో పనిచేసిన నాయకులకు సీఎం జగన్ మంచి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేలా 15 రోజుల్లో కమిటీలను నియమిస్తామని చెప్పారు. మహిళల సాధికారతకు సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వరుదు కళ్యాణి తెలిపారు. అమ్మ ఒడి, ఆసరా వంటి పథకాల ద్వారా మహిళలకు ఎంతో తోడ్పాటును అందజేస్తున్నారన్నారు. అంతకు ముందు యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నేతృత్వంలో యువజన విభాగం సమావేశం జరిగింది. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌ఛార్జ్‌లు, జిల్లా అధ్యక్షుల అభిప్రాయాలను విజయసాయిరెడ్డి తెలుసుకున్నారు.

## గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లకు సీఎం గ్రీన్ సిగ్నల్

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
గ్రూప్-1. గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ జారీకి సీఎం వైయస్.జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ఉదయం ముఖ్యమంత్రికి అధికారులు ఈపోస్టుల భర్తీపై వివరాలు అందించారు. సీఎం ఆదేశాల మేరకు ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ చురుగ్గా సాగుతోందని వెల్లడించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి ఖాళీల వివరాలు తెప్పించుకున్నామని వెల్లడించారు. నోటిఫికేషన్ జారీకి అవసరమైన కసరత్తు తుదిదశలో ఉందని తెలిపారు. గ్రూప్-1కి సంబంధించి సుమారు 100కిపైగా పోస్టులు, గ్రూప్-2కు సంబంధించి సుమారు 900కిపైగా పోస్టులు, మొత్తంగా 1000కిపైగా పోస్టులు భర్తీచేయనున్నామని తెలిపారు. వీలైనంత త్వరలో దీనికి సంబంధించి నోటిఫికేషన్ జారీచేయాలని సీఎం ఆదేశించారు. పరీక్షల నిర్వహణ, ఫలితాలు వెల్లడి తదితర అంశాలపైనా దృష్టిసారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# ములుగులో పలు అభివృద్ధి పథకాలకు ప్రారంభోత్సవం

**- మంత్రి కేటీఆర్**



**ములుగు, నేటి పత్రిక ప్రజావార్త :**
'నా తెలంగాణ కోటి రతనాల వీణ అని జైలు గోడలపై బొగ్గుతో రాసుకున్న దాశరథి మాటలకు అనుగుణంగా నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో పద్నాలుగేళ్లు పోరాడిన నేత కేసీఆర్. తెలంగాణ కోటి రతనాల వీణ కాదని కోటిన్నర ఎకరాల మాగాణ అని నిరూపించి చూపించారు..' అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ అన్నారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో సాగు పెట్టుబడికి రూ.2 వేలు ఇస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తోంది. అక్కడి రైతులు ఎంత పండించినా, ప్రభుత్వం 12 క్వింటాళ్లనే కొంటోంది. అదే తెలంగాణలో రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర సర్కారు కొనుగోలు చేస్తోంది. ఇది కాంగ్రెస్ నాయకులకు కనిపించట్లేదు. పైగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తూ ఎగిరెగిరి పడుతున్నారు..' అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు శుభ్రమైన మంచినీటిని అందించడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతో ములుగు, భద్రాచలం ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారని తెలిపారు.

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా ములుగులో బుధవారం మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌తో కలిసి జిల్లా సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మినీ బస్సు డిపో, మోడల్ పోలీస్‌స్టేషన్, గ్రంథాలయ భవనం, శ్మశానవాటిక నిర్మాణాలకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం సాగునీటి దినోత్సవం సందర్భంగా వెంకటాపురం(ఎం) మండలం రామప్ప రిజర్వాయర్‌లో భీం ఘన్‌పూర్ నుంచి వస్తున్న గోదావరి జలాలకు పూజలు చేశారు. తర్వాత ములుగులో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. 'ములుగు నియోజకవర్గంలో ప్రతిపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ సీఎం కేసీఆర్ మదిలో ఈ ప్రాంత ప్రజలపై అమితమైన ప్రేమ ఉంది. ఇందులో భాగంగానే రూ.133 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ములుగు ఎమ్మెల్యే వినతిపత్రం అందించకపోయినా మెడికల్ కళాశాల మంజూరు చేశాం. గ్రామ పంచాయతీగా ఉన్న ములుగును మున్సిపాలిటీగా మారుస్తూ ఇటీవల జరిగిన శాసనసభ సమావేశంలో బిల్లు ప్రవేశపెట్టాం. అయితే కొంతమంది కాంగ్రెస్ నాయకులు మోసపూరిత మాటలతో పక్కదారి పట్టిస్తున్నారు. కేసీఆర్ పాలనపై చిన్నబిడ్డల నుంచి ముసలివాళ్ల వరకు ఆలోచన చేయాలి..అని మంత్రి విజ్ఞప్తి చేశారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అడ్డం పొడుగు లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన అంబటి రాయుడు



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తాడేపల్లిలోని సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. అంబటి రాయుడితో పాటు సీఎస్‌కే ఫ్రాంచైజీ ఓనర్ ఎన్.శ్రీనివాసన్ కుమార్తె రూపా గురునాథ్ కూడా సీఎం జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల తమ జట్టు గెలిచిన ఐపీఎల్ 2023 ట్రోఫీని సీఎంకు చూపించారు. ఈ సందర్భంగా ఏపీలో క్రీడారంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా క్రీడలను ప్రోత్సహించడానికి తాను ఆసక్తిగా ఉన్నట్లు సీఎం జగన్‌కు అంబటి రాయుడు వివరించారు. వారి సూచనల మేరకు పటిష్టమైన కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఐపీఎల్‌లో అంబటి రాయుడు ప్రాతినిధ్యం వహించిన సీఎస్‌కే ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించి, ఐదో సారి విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌కు ముందు రాయుడు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఫైనల్ మ్యాచ్ ఆడి రాయుడు ఐపీఎల్ కెరీర్‌కు ముగింపు పలికాడు. కాగా, రాయుడు.. సీఎం జగన్ కలవడం ఇటీవలికాలంలో ఇది రెండోసారి. ఐపీఎల్ ఫైనల్‌కు ముందు కూడా రాయుడు ఓసారి సీఎంను కలిశారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, క్రీడారంగంలో యువతకు అవకాశాలు, శిక్షణ తదితర అంశాలపై రాయుడు సీఎం జగన్‌తో చర్చించారు.

## హజ్‌యాత్రికుల బృందాన్ని కలిసిన సీఎం జగన్



**గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త :**
హజ్ యాత్రికుల బృందాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిశారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులో ఏర్పాటు చేసిన హజ్ క్యాంప్ నుంచి హజ్‌యాత్ర బృందం బయల్దేరనుంది. దీనిలో భాగంగా నంబూరుకు బయల్దేరి వెళ్లిన సీఎం జగన్.. యాత్రికులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తొలిసారిగా నంబూరు హజ్ క్యాంప్ నుంచి హజ్ యాత్రికలు బృందం బయల్దేరనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రం తరఫున హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేశారు సీఎం జగన్. రాష్ట్రం గురించి ప్రార్థన చేయమని కోరుతున్నానని, రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకుంటున్నాని సీఎం జగన్ తెలిపారు. హజ్ యాత్రలో మీకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందన్నారు. హజ్ యాత్రలో ఇబ్బంది తలెత్తకుండా కమిటీని పంపిస్తున్నామని, హజ్ యాత్రికులకు ఏ సమస్య వచ్చినా అంజద్ బాషా చూసుకుంటారన్నారు సీఎం జగన్. ఎమ్మెల్యే అంజద్ బాషాతో పాటు ఇతర అధికారులు మీకు అందుబాటులో ఉంటారని హజ్ యాత్రికులకు సీఎం జగన్ భరోసా ఇచ్చారు.

## ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక అందించేలా అన్ని చర్యలు




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
జిల్లాలో ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక అందించేలా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సిఎస్ కె.ఎస్. జవహర్‌రెడ్డికి వివరించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి ఆయన కార్యాలయం నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, విద్య, వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో జగనన్న విద్యా కానుక, మనబడి నాడు-నేడు, డా.వైఎస్సార్ కంటి వెలుగు, అమ్మఒడి, స్పందన ధరఖాస్తుల పరిష్కారం, పిహెచ్‌సిల నిర్మాణ పనులు తదితర అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా నుండి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు జిల్లాలోని 951 పాఠశాలకు సంబంధించిన జగనన్న విద్యా కానుక కిట్లలో భాగమైనా పుస్తకాలు, స్కూల్ బ్యాగ్సు, బెల్టు, శాతం యూనిఫారం, షూస్, డిక్షనరీలను విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్దం చేశామని వివరించారు. నాడు-నేడు పనులలో భాగంగా ఈనెల 12వ తేదిన పాఠశాలలు ప్రారంభించే నాటికి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. డా.వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా అవ్వాతాతలకు జిల్లాలో 2 లక్షల 8 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించాలనే లక్ష్యం కాగా ఇప్పటికే 99 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఇంకనూ నిర్వహించవలసిన కంటి పరీక్షలను వారానికి 10 వేలు పరీక్షలను లక్ష్యంగా నిర్ధేశించుకుని సెప్టెంబర్ మాసంలోగా పూర్తి చేసేలా ప్రణాళిక సిద్దం చేసుకున్నామన్నారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వత్సవాయి మండలంలోని భీమవరం, విజయవాడ రూరల్ మండలంలోని నున్న గ్రామాలలో స్థల సేకరణ సమస్య పరిష్కారం కాబడి, స్థలం కేటాయింపు జరిగిందని, త్వరితగతిన ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డిల్లీరావు ప్రధాన కార్యదర్శికి వివరించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి డిఇవో సివి రేణుక, సమగ్ర శిక్ష అభియాన్ అడిషన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి. మహేశ్వరరావు, డియంహెచ్‌వో డా. యం సుహాసిని, ఐసిడిఎస్ పిడి జి.ఉమాదేవి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ జె. సుమన్ పాల్గొన్నారు.

## సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్ పాలన



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
అభివృద్ధే లక్ష్యం, సంక్షేమమే పరమావధిగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 26 వ డివిజన్ 28 వ వార్డు సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి అంగిరేకుల నాగేశ్వరరావు గొల్లభామ, కోఆర్డినేటర్ కోలా నాగాంజనేయులుతో కలిసి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాల్వ గట్టు వెంబడి విస్తృతంగా పర్యటించి 313 గడపలను సందర్శించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన మంచితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాసిన లేఖను లబ్ధిదారులకు వివరించారు. సెంట్రల్ నియోజకవర్గంలో 77 శాతానికి పైగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి అర్హులను గుర్తించడంలో ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఇంటికి యూజీడీ కనెక్షన్ ఇవ్వవలసిందిగా వీఎంసీ అధికారులకు సూచించారు. అలాగే ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. నవరత్నాల పథకాల ద్వారా 28 వ వార్డు సచివాలయ పరిధిలో 3 కోట్ల 81 వేల 530 రూపాయల సంక్షేమాన్ని నాలుగేళ్లలో అందజేసినట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి.. అన్ని శాఖలలోనూ రూ. వందల కోట్ల బకాయిలు పెట్టిన చంద్రబాబుకు సీఎం జగన్‌ను విమర్శించే నైతిక అర్హత ఎక్కడిదని మల్లాది విష్ణు ప్రశ్నించారు. గత ఎన్నికల్లో 23 స్థానాలకు పరిమితమైన తెలుగుదేశం పార్టీ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జీరోకి పరిమితం కావడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాడిద అప్పారావు, డి.శంకర్, పారా ప్రసాద్, పిల్లుట్ల వంశీ, సుధాకర్, అన్సారీ బేగ్, ఎం.శ్రీనివాస్, బాడిత సత్యవతి, బెజ్జం రవి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సినిమాల సందడి.. ఓటీటీలో ఒకే రోజు ఏకంగా 21 సినిమాల సందడి

**సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త :**
ఇప్పటికే చాలా సినిమాలు సిరీస్‌లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. థియేటర్ కు వచ్చిన సినిమాలు నెల రోజుల గ్యాప్ లోనే ఓటీటీలో దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలోనే చాలా సూపర్ హిట్ సినిమాలు ఓటీటీలో ప్రేక్షకులకు ఫుల్ గా ఎంటర్టైన్మెంట్ చేస్తున్నాయి. ఈ మధ్య కాలంలో ఓటీటీ క్రేజ్ రోజు రోజుకు పెరుగుతోంది. వీకెండ్ వచ్చిందంటే చాలు ఓటీటీల్లో సినిమాల సందడి మాములుగా ఉండదు. ఇప్పటికే చాలా సినిమాలు సిరీస్ లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. థియేటర్ కు వచ్చిన సినిమాలు నెల రోజుల గ్యాప్ లోనే ఓటీటీలో దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలోనే చాలా సూపర్ హిట్ సినిమాలు ఓటీటీలో ప్రేక్షకులకు ఫుల్ గా ఎంటర్టైన్మెంట్ చేస్తున్నాయి. ప్రతి వారం పదుల సంఖ్యలో సినిమాలు ఓటీటీలో రిలీజ్ అయ్యి ఆకట్టుకుంటున్నాయి. ఇక ఈ వీకెండ్ లో కూడా ఓటీటీ లో సినిమా సందడి గట్టిగానే ఉండనుంది. సినిమాలు దాదాపు 21 కానున్నాయి. ఈ వారం ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, సిరీస్‌ల లిస్ట్ ఇదే. ఓటీటీలో రిలీజ్ అవుతున్న సినిమాల్లో ముందుగా చెప్పుకోవాల్సింది నాగ చైతన్య కస్టడీ గురించే. రీసెంట్ గా రిలీజ్ అయిన ఈ మూవీ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతున్న సినిమాలు కస్టడీ, మై ఫాల్ట్ (హాలీవుడ్ సినిమా), మెన్ టు. సోనీ లివ్ లో 2018. అలాగే డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ లో అవతార్ : ది వే ఆఫ్ వాటర్ , సెయింట్ ఎక్స్ , ఎంపైర్ ఆఫ్ లైట్, ఫ్లామిన్ హాట్ స్ట్రీమింగ్ అవుతున్నాయి. ఇక ఆహా తమిళ్ లో మలై నేర మలిపో స్ట్రీమింగ్ అవుతోంది. నెట్‌ఫ్లిక్స్ లో బర్రకుడ క్వీన్స్ ..( జూన్ 5), ఆర్నార్డ్ ..( జూన్ 7), నెవర్ హావ్ ఐ ఎవర్ .. (జూన్ 8), టూర్ డి ఫ్రాన్స్ .. (జూన్ 8). జీ5లో ది ఐడల్ .. (జూన్ 5), గునెగార్, కోయి బాత్ చలే, కుసుమ్ మనోహర్ లేలే. అలాగే జియో సినిమాలో బ్లడీ డాడీ, యూపీ 65.ఇక బుక్ మై షోలో పొలైట్ సొసైటీ, ది హనీమూన్ స్ట్రీమింగ్ కానున్నాయి.

# శరవేగంగా పోలవరం ప్రాజెక్టు పనులు.. తమ హయాంలోనే ప్రాజెక్టును పూర్తి చేస్తాం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణా ఈస్టన్ హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సాగునీటిని బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, శాసనసభ్యులు, అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి కాలువకు నీటిని విడుదల చేశారు.




ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ కృష్ణా డెల్టా రైతాంగానికి ఈ ఖరీఫ్ సీజన్లో ముందుగానే సాగునీటిని విడుదల చేస్తున్నామని అన్నారు. కృష్ణా డెల్టాకు కుడి ఎడమవైపు గుంటూరు, కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. గతంలో జూన్ నెలాఖరు, జూలై నెలలో సాగునీటిని విడుదల చేసేవారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముందు చూపుతో రైతులకు ఖరీఫ్‌లో ముందుగానే సాగునీరు అందించేందుకు ఇచ్చిన ఆదేశాలతో నెల ముందుగానే పంటలకు సాగు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో సాగునీటిని ముందుగానే అందించడం వల్ల రైతులు మూడు పంటలు పండించుకునేందుకు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాల నుండి పంటలను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురుస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు తొలి దశలో అవసరమయ్యే 12,911.15 కోట్ల రూపాయల వ్యయాన్ని ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించడం శుభ పరిణామం అన్నారు. ప్రాజెక్టు పనులు శరవేయంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా దేవుని దయతో వర్షాలు పుష్కలంగా కురిసి ప్రాజెక్టులలో నీరు సమృద్ధిగా ఉండి జలకళను సంతరించుకున్నాయన్నారు. రైతులకు మేలు జరిగి దిగుబడి అధిక మొత్తంలో రావడంతో మద్దతు ధర లభించి రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, శాసన సభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణువర్ధన్, దూలం నాగేశ్వరరావు, జన వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ సి.నారాయణ రెడ్డి, ఆర్ సతీష్. డిప్యూటీ ఇఎన్ సి శివప్రసాద్ రెడ్డి, ఎస్ ఇఎస్. తిరుమలరావు, ఇఇలు పివిఆర్ కృష్ణారావు, కే.బాబు, ఎఇఇ దినేష్ ఉన్నారు.

## రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి మచిలీపట్నం పోర్టు కేంద్ర బిందువు : ఎమ్మెల్యే పేర్ని

**మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త :**
తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలతోనూ వాణిజ్య వ్యాపార సంబంధాలు బలపడి మన రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి మచిలీపట్నం పోర్టు కేంద్ర బిందువు కాగలదని మాజీ మంత్రివర్యులు, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) ధీమా వ్యక్తం చేశారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణంలో మరో ముందడుగుగా ఉత్తరపు బ్రేక్ వాటర్ గోడ నిర్మాణ పనులకు మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) గురువారం మంగినపూడి బీచ్ సమీపంలో సముద్రపు ఒడ్డున భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ, సౌత్ బ్రేక్ వాటర్ వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత నెల 22వ తేదీన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారని, కేవలం 17 రోజుల వ్యవధిలోనే 160 మీటర్ల దూరం సముద్రంలో దక్షిణ అడ్డగింపు గోడ నిర్మాణం వేగవంతంగా పూర్తయిందని ఎమ్మెల్యే పేర్ని నాని నిర్మాణ సంస్థ పనితీరు పట్ల ప్రశంసించారు. చిన్న కొండరాయి మొదలుకొని అర టన్ను బరువు ఉండే భారీ రాయి వరకు సముద్రం అడుగు బాగా నుంచి పూడ్చుకొంటూ వస్తున్నారని, ఇలా సముద్రంలో 2 కిలో మీటర్ల దూరం వరకు పటిష్టంగా నిర్మించుకుంటూ ముందుకు వెళతారన్నారు. సముద్రంలో సౌత్ బ్రేక్ వాటర్, నార్త్ బ్రేక్ వాటర్ గోడల ప్రాముఖ్యతను ఎమ్మెల్యే పేర్ని నాని వివరించారు. బందరు పోర్టు నిర్మాణాన్ని విడతల వారీగా చేయాలని ప్రభుత్వం భావిస్తోందని ఎమ్మెల్యే నాని తెలిపారు. ఈ పోర్టు నిర్మాణం పూర్తయితే 80 వేల టన్నుల బరువుతో వచ్చే షిప్పులు సైతం సురక్షితంగా రాగలుగుతాయి. పోర్టుకు వచ్చే భారీ వాహన కంటైనర్లు, లోడు టిప్పర్లు, లారీల రాకపోకలకు ఒక రైల్వే కం ఓవర్ బ్రిడ్జి, రెండు వంతెనలు రానున్నట్లు ఎమ్మెల్యే పేర్ని నాని తెలిపారు. బందరు పోర్టు అందుబాటులోకి వస్తే తెలంగాణ నుంచి ఈ పోర్టు గుండా ఎక్కువగా ఎగుమతులు, దిగుమతుల ఆర్డర్లు వస్తాయనే అంచనాలు సైతం ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత థామస్ నోబుల్, ముడా చైర్ పర్సన్ బొర్రా నాగ వెంకట దుర్గా భవాని, మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ సలార్ దాదా, మచిలీపట్నం మాజీ జడ్పిటిసి లంకె వెంకటేశ్వరరావు (ఎల్వీయార్), కృష్ణాజిల్లా అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మచిలీపట్నం మార్కెటింగ్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ ముస్తఫా ( అచ్చాబా ), యువజన నాయకుడు పేర్ని కృష్ణమూర్తి ( కిట్టు), మచిలీపట్నం పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ విద్యాశంకర్, మేఘా ఇంజనీరింగ్ సంస్థ ప్రాజెక్ట్ హెడ్ తులసీదాస్, మంగినపూడి సర్పంచ్ కూనపురెడ్డి వీరాస్వామి, పలువురు కార్పొరేటర్లు, పలు గ్రామాల సర్పంచులు, 50 డివిజన్‌లకు సంబంధించిన వాలంటీర్లు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోడు భూములకు పట్టాలు వెంటనే ఇవ్వాలి : సీతక్క డిమాండ్



**ములుగు, నేటి పత్రిక ప్రజావార్త :**
జిల్లాలో బుధవారం కేటీఆర్ పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే సీతక్క పలు డిమాండ్లు చేశారు. ములుగు ప్రాంతానికి గోదావరి జలాలు అందించేలా రామప్ప నుంచి లక్నవరం వరకూ కెనాల్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. గోదావరిలో లిఫ్ట్ ఏర్పాటు చేసి చెరువులు నింపాలన్నారు. మెడికల్ కళాశాల పనులు వేగవంతం చేసి, గిరిజన యూనివర్సిటీ తరగతులు వెంటనే ప్రారంభించాలన్నారు. పోడు భూములకు పట్టాలు వెంటనే ఇవ్వాలన్నారు. మూతపడ్డ మంగపేట మండలం కమలాపూర్‌లో బిల్ట్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని సీతక్క డిమాండ్ చేశారు. ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్ చేయాలన్నారు. మంగపేట కేంద్రంగా ఇంజనీరింగ్ కళాశాల, గోవిందరావుపేట మండలం పసర కేంద్రంగా సమ్మక్క సారలమ్మ నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలన్నారు. మల్లంపల్లి, లక్ష్మీదేవిపేట, రాజుపేటలను మండలాలుగా ప్రకటించాలని ఎమ్మెల్యే సీతక్క అన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు సంతోషం : దేవినేని అవినాష్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 10వ డివిజన్ 42వ సచివాలయం పరిధిలోని ఆర్టీసీ కాలనీ మరియు టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ లబ్ది వివరాల కరపత్రాలు అందజేసిన తూర్పు నియోజకవర్గ వైస్సార్సీపీ ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాష్. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఆర్టీసీ కాలనీ మరియు టీచర్స్ కాలనీలలోని ప్రజలు అంత స్వచందంగా వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు వారి సంతోషాన్ని వ్యక్తం చేసారు. గతంలో నెహ్రూ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గత 5సంవత్సరాల కాలంలో తెలుగుదేశం పార్టీ వల్ల ఎలాంటి అభిరుద్ధి జరగలేదు అని కనీసం రోడ్డు ప్యాచ్ వర్క్ కూడా చేయలేదు అని, ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచి ఒక్కసారి కూడా మాకు కనిపించలేదు అని స్థానికులు ప్రజలు వారి బాధని వ్యక్తం చేయడం జరిగింది అని అవినాష్ అన్నారు. కానీ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకువచ్చి ఎలాంటి సమస్య వచ్చిన రోజుల వ్యవధిలోనే సమస్యలను పరిష్కరిస్తూ జనం మెచ్చే క్రయక్రమాలు చేస్తున్నారు ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు అని అవినాష్ అన్నారు. అభివృద్ధి ధ్యేయంగా గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఈ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. స్థానికులు మా వద్దకు తీసుకువచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం అని అహామీ ఇవ్వడం జరిగింది. ప్రస్తుత ఎమ్మెల్యేకి ఇక్కడ సమస్యలు ఎన్నిసార్లు చెప్పిన ఉపయోగం లేదు అని ప్రజలు వారి కష్టాలను చెప్పుకున్నారు అని అవినాష్ అన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఉండి కూడా నియోజకవర్గాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదు అని అవినాష్ ప్రశ్నించారు. మీ డ్రామాలు ప్రజలకు అర్థం అయ్యాయని ఇక మీ ఆటలు సాగవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ ఇన్‌ఛార్జ్ కరుటూరి హరీష్, అల్లా చల్లారావు, ఆర్టీసీ కాలనీ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, టీచర్స్ కాలనీ ప్రెసిడెంట్ మోహన్‌కుమార్ కావటి దామోదర్, చిమటా బుజ్జి, అచ్చుతరావు, పవన్, ఉదయ్, చిత్రం లోకేష్, నవీన్, కాళీ, చందు, ఆనంద్ మరియు వైస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోకుల క్షేత్రంలో రాధాకృష్ణుల విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
తాడేపల్లిలోని హరే కృష్ణ గోకుల క్షేత్రంలో గురువారం శ్రీశ్రీశ్రీ రాధా కృష్ణచంద్రుల ఉత్సవ విగ్రహాలను ప్రాణ ప్రతిష్ట చేశారు. అక్షయ పాత్ర చైర్మన్ హెచ్‌జీ మధు పండిత్ ప్రభు ఈ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైభవోపేతంగా జరిగిన ఈ కార్యక్రమం నూటికో కోటికో ఎవరికో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని అవకాశం దొరుకుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి హరే కృష్ణ గోకుల్ క్షేత్రం అధ్యక్షులు హేజీలు వంశీ ధర దాస ప్రభు, జై చైతన్య ప్రభు, సత్య గౌర చంద్ర ప్రభు, సువ్యక్త నర్సింహ ప్రభు, జగన్మోహన్ ప్రభు, నిష్కించన ప్రభు, అధ్యక్షుడు, లక్ష్మీకాంత ప్రభు, యజ్ఞేశ్వర ప్రభు పాల్గొన్నారు.

# బ్రెయిన్ ట్యూమర్‌కు అత్యాధునిక వైద్య ప్రక్రియ

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
మెదడు పనిచేయడం లేదు..బుర్ర హీటెక్కింది.. అనే మాటలు వింటుంటాం. మానవ శరీరం మొత్తంలో మెదడుకు ఉన్న ప్రాధాన్యత అలాంటిది. చూసే కళ్లు.. నడిచే కాళ్లు అన్నీ మెదడు ఆధీనంలో ఉంటాయి. రుచి, వాసన, స్పర్శ, వినడం లాంటి అన్ని పనులు మెదడు కణాలు చేసేవే. ఆకలి, దాహం లాంటివి కూడా మెదడు కణాల ద్వారానే తెలుసుకుంటాం. చేతులు, కాళ్లు, కళ్లు, చెవులు, నాలుక.. ఇలా శరీరం అవయవాల్లోని ఏ అవయవం పనిచేయాలన్నా దానికి మూలా ధారం మెదడు. మెదడు ఎంత కీలకమో, అంతే సున్నితం. అలాంటి మెదడులో గడ్డ (ట్యూమర్) ఏర్పడితే అది ఎంతో ప్రమాదకరమని విజయవాడ కామినేని ఆస్పత్రి సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ సాలుమూరి ప్రేమ్‌చంద్ తెలిపారు. మెదడులోని ఒక అవయవాన్ని నియంత్రించే భాగంలో గడ్డ ఏర్పడితే అది ఆ నియంత్రణ కేంద్రంపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా ఆ అవయవం చచ్చుబడిపోయే ప్రమాదం ఉంటుంది. మెదడులో అసాధారణంగా పెరిగే కణజాలాన్ని గడ్డ (ట్యూమర్) అని అంటారు. మెదడులో ఏర్పడిన కణతుల వల్ల మెదడుపై ఒత్తిడి పెరిగి, ఆరోగ్యవంతమైన మెదడు కణాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. మెదడులో గడ్డలు ఏర్పడితే మాత్రం అంత సులువుగా తెలుసుకోలేం. కొన్ని లక్షణాలను, శరీరంలో కనిపించే అసాధారణ మార్పు లను బట్టి బ్రెయిన్ ట్యూమర్‌గా అనుమానించాలి. జన్యుపరమైన కారణాలతో బ్రెయిన్ ట్యూమర్ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి కుటుంబంలోగానీ, వంశంలోగానీ బ్రెయిన్ ట్యూమర్ వచ్చిన దాఖలాలు ఉంటే వారు జాగ్రత్తగా ఉండాలి. దాంతో పాటు ఎక్కువగా రేడియేషన్ ప్రభావానికి గురయ్యే వారిలో బ్రెయిన్ ట్యూమర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మెదడులో కణితి ఏర్పడిన ప్రాంతాన్ని బట్టి లక్షణాలు ఉంటాయి. సాధారణంగా తలనొప్పి వచ్చి, క్రమంగా పెరుగుతూ ఉండడం. ఉదయం లేవగానే తలనొప్పి ఎక్కువగా ఉండటంతో పాటు వాంతులు కావడం. వాంతి చేసుకోగానే తలనొప్పి నుంచి ఉపశమనం పొందినట్లు అనిపించడం. తలనొప్పి తగ్గగానే సాధారణంగా అనిపించడం. చూపులో తేడా రావడం, అస్పష్టంగా కనిపించడం. కొన్ని సందర్భాలలో పక్షవాతం రావడం. మెదడులో కణితి ఏర్పడిన భాగాన్ని బట్టి శరీరంలో భాగాలు బలహీనపడడం వంటివి బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలని డాక్టర్ సాలుమూరి ప్రేమ్‌చంద్ తెలిపారు.



# అన్ని సమస్యలను అధిగమించి ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలి : సీఎం జగన్ ఆదేశం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి, ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చాలని జల వనరుల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్బోధించారు. టీడీపీ సర్కార్ హయాంలో చంద్రబాబు చేసిన తప్పిదం వల్ల గోదావరి వరదల ఉధృతికి ఈసీఆర్ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నదీ గర్భంలో ఇసుక తిన్నెలు కోతకు గురై ఏర్పడిన అగాధాలను ఇసుకతో నింపి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చే పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల కొత్తగా సమాంతరంగా 'యూ' ఆకారంలో కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి.. పాత దానితో అను సంధానం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ పనులు పూర్తయితే.. ఇప్పటికే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తయిన నేపథ్యంలో వాటి మధ్య గోదావరి వరదల్లోనూ ఈసీఆర్ఎఫ్ (ప్రధాన) డ్యామ్ పనులు చేపట్టి.. గడువులోగా పూర్తి చేయడానికి మార్గం సుగమం అవుతుందని సూచించారు. మంగళవారం ప్రాజెక్టు పనుల పురోగతిపై ఏరియల్ సర్వే నిర్వహించారు. మండుటెండలో తీవ్రమైన ఉక్కపోత మధ్య సీఎం జగన్ పోలవరం ప్రాజెక్టు పనులను ఒక గంటా 40 నిమిషాలపాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. టీడీపీ సర్కార్ హయాంలో ఎగువ కాఫర్ డ్యామ్‌లో రెండు వైపులా 800 మీటర్లు ఖాళీ వదిలేసి, అరకొరగా చేసిన పనులను.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 44 మీటర్ల ఎత్తుతో పూర్తయిన ఎగువ కాఫర్ డ్యామ్ పనులను కళ్లకు కట్టినట్లు వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత పోలవరం ప్రాజెక్టు వద్దే మీటింగ్ హాల్‌లో జల వనరుల శాఖ అధికారులతో సీఎం వైఎస్ జగన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టులో తొలి దశను పూర్తి చేయడానికి అవసరమైన రూ.12,911.15 కోట్లను విడుదల చేసేందుకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ఆర్థిక శాఖ మెమోరాండం జారీ చేసిందని జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సీఎంకు వివరించారు. ప్రాజెక్టు స్ట్రక్చర్‌తో ఏమాత్రం సంబంధం లేని గైడ్ వాల్‌లో ఉత్పన్నమైన చిన్న సమస్యను పెద్ద విపత్తులా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని కూడా పాజిటివ్‌గా తీసుకుని సరిదిద్దే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రి పినిపే విశ్వరూప్, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరావు, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టులోని కీలక పనుల్లో ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌కు అధికారులు వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించడంపై సీఎం వైఎస్ జగన్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. గతేడాది నిర్వహించిన లైడార్ సర్వేలో 41.15 మీటర్ల కాంటూర్‌లోకి 36 గ్రామాలు వస్తాయని తేలిందని, ఆ గ్రామాల్లోని 16,642 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలని చెప్పారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు వద్ద అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యాటకులను ఆకట్టుకునేలా బ్రిడ్జి నిర్మించాలని సూచించారు. పర్యాటకుల కోసం అధునాతన సదుపాయాలతో హోటల్ ఏర్పాటు చేయాలన్నారు.




## మీ జానకి ఇదిగో.. ప్రభాస్



**సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త :**

ఒక ఉత్సవం ముగిసింది. కానీ.. ఆ ఉత్సవం తెచ్చిన ఉత్సాహం మాత్రం ఆగలేదు. వినోదం అంటే ప్రాణం పెట్టె తెలుగు ప్రజలు.. ప్రభాస్ లాంటి హీరో పబ్లిక్ లో మాట్లాడిన మాటలు అంత తొందరగా మర్చిపోలేరుగా. ఆదిపురుష్ ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా తిరుపతిలో జరిగిన విషయం తెలిసిందే. ఈ ఈవెంట్‌లో ప్రభాస్ అభిమానులతో మాట్లాడారు. పబ్లిక్‌లో మాట్లాడటానికి మొహమాట పడే ప్రభాస్.. అంతా పెద్ద ఈవెంట్‌లో.. లక్షల మంది అభిమానుల మధ్యలో కొద్దిగా సిగ్గుపడుతూనే.. చాలా విషయాల గురించి మాట్లాడారు. అయితే, అభిమాన జన సందోహం ఆయన పెళ్లి గురించి నెరుగానే నినాదాలు చేయడంతో పెళ్లి చేసుకుంటా.. అదీ తిరుపతిలోనే అంటూ అభిమానుల్లో జోష్ నింపారు. ఇక ఆదిపురుష్ సినిమాలో నటించడం తన అదృష్టం అని చెప్పిన ప్రభాస్.. దర్శకుడు ఓం రౌత్ గురించి.. ఇతర నటుల గురించి స్టేజి మీద అనేక విషయాలు చెప్పి వారి కృషిని మెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదిపురుష్‌లో సీతగా నటించిన కృతి సనన్ గురించి ప్రభాస్ మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కృతిని అభిమానులకు పరిచయం చేస్తూ.. ఇక ఈమె మీ జానకి అంటూ చెప్పారు. దానికి కృతి సిగ్గు పడుతూనే ముసిముసి నవ్వులు చిందించింది. ఆమె నటన చాలా బావుందనీ.. సీతాగా ఒక దృశ్యంలో ఆమె బాధపడుతూ కనిపించాలని.. దానిని ఆమె చాలా చక్కగా చేశారనీ చెప్పారు. ఈ సమయంలో స్క్రీన్ పై కృతి నటించిన సీన్ ఇమేజ్ ప్లే చేశారు. అది చూపిస్తూ ప్రభాస్ ఎలా ఉంది అని అభిమానులను అడిగారు.. తరువాత కృతిని పిలిచి ఇది నువ్వు చేసిందే కదా.. సీజీ కాదు కదా అని ఆటపట్టించారు. ఆదిపురుష్ తాను చేస్తున్నానని తెలిసిన వెంటనే మెగాస్టార్ చిరంజీవి ప్రభాస్‌కు ఫోన్ చేశారట. రామాయణం సినిమా చేస్తున్నావా? అని ఆయన అడిగారట ప్రభాస్‌ని. అవును అని ప్రభాస్ చెప్పిన వెంటనే.. "ఎంతో అదృష్టం ఉంటేనే కానీ రామాయణంలో నటించే ఛాన్స్ రాదు.. ఆ అదృష్టం నీకొచ్చింది" అంటూ చిరంజీవి అభినందనలు చెప్పారట. ఈ విషయాన్ని స్వయంగా చెప్పిన ప్రభాస్ తనకు ఆ అదృష్టం దక్కిందని చెబుతూ ఎమోషన్ అయ్యారు. క్యూట్‌గా సాగిన ఈ ఎపిసోడ్ అదిపురుష్ ఈవెంట్‌లో ప్రభాస్ స్పీచ్‌లో హైలైట్‌గా నిలిచింది. మొత్తమ్మీద ఇప్పుడు ప్రభాస్ ఆదిపురుష్ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులందరిలోనూ అంచనాలను అమాంతం పెంచేసింది.

## 9 నుంచి మూడు రోజుల పాటు ఉచిత పుస్తక వితరణ

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

విద్యా సంస్థల పునఃప్రారంభం సందర్భంగా నగర వాసులు...ముఖ్యంగా విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగించే వినూత్న కార్యక్రమాన్ని ఎప్పటిలా చేపడుతున్నట్లు బందరు రోడ్డు బకింగ్ హాంపేట రామ్మోహన్ గ్రంథాలయం పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు చింతలపూడి కోటేశ్వరరావు, వేములపల్లి కేశవరావు, ఉపాధ్యక్షులు దమ్మాలపాటి రామచంద్రరావు తెలిపారు. ఈనెల 9వ తేది నుంచి 11వ తేది వరకు వరుసగా మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాస, వివిధ ప్రవేశ పరీక్షల,వైద్యశాస్త్ర, భాషా బోధన పుస్తకాలు, నవలలు, నిఘంటువులు, న్యాయ, వాణిజ్య శాస్త్ర పుస్తకాలను వితరణ చేయుచున్నామని...ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపర్చుకోవల్సిందిగా వారు కోరారు.

## కార్తీక మాసంలో శ్రీశైల దేవస్థానంలో కుంబాభిషేకం




**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

పండితులు, పీఠాధిపతులు సూచనలమేరకు మహాశివునికి ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసంలో శ్రీశైల దేవస్థానం కుంబాభిషేకం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మరియు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం సూచనల మేరకు ఇప్పటికే పలువురు పీఠాధిపతులు, పండితులను ఈ విషయంలో సంప్రదించడంమైందని, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, సామవేదం షణ్ముఖ శర్మ మరియు ఇతర పండితులను కూడా త్వరలోనే సంప్రదించనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాలయం నాల్గో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో ఆయన పాత్రికేయులతో మట్లాడుతూ నేడు రాష్ట్ర ధార్మిక పరిషత్ సమావేశం జరిగిందని ఆ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానంలో శివాజీ మహారాజ్ కట్టించిన ఉత్తర రాజగోపురం పాడైపోయిన నేపథ్యంలో 2014లో దాన్ని పునర్నించినప్పటికీ ఆగోపురం పై కలశాల స్థాపన జరుగలేదన్నారు. ఈ విషయం తమ ప్రభుత్వ దృష్టికి రాగానే టి.టి.డి. వారికి ఆరు కేజీల బంగారాన్ని ఇచ్చి ఆ కలశాలను చేయించమైందన్నారు. యజ్ఞ యాగాదులతో ఆ కలశాలను ఉత్తర రాజగోపురం పై ప్రతిష్టించి ఈ ఏడాది మే మాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా కుంబాభిషేకం చేయించాలనుకున్నామన్నారు. ఈ మండు వేసవిలో ఎంతో ఎత్తులో ఉన్న ఉత్తర రాజగోపురం ఎక్కి కలశాల కుంబాభిషేకం చేయడం ఎంతో కష్టమని, భక్తులు కూడా ఈ కార్యక్రమానికి మండు వేసవిలో వచ్చేందుకు ఎంతో ఇబ్బందిగా ఉంటుదని కంచికామకోటి పీఠాధిపతితో పాటు పలువురు పండితులు చేసిన సూచనలు, సలహాలు మేరకు ఈ కుంబాభిషేక కార్యక్రమాన్ని వాయిదా వేయడమైందన్నారు. కంచి కామకోటిపీఠాధిపతులతో పాటు పలువురు పీఠాధిపతులు, పండితులను ఈ విషయంలో సంప్రదించగా కార్తీక మాసంలో చేయడం ఎంతో ఉత్తమమని సలహా ఇవ్వడం జరిగిందన్నారు. వారి సూచనలు, సలహాల మేరకు ఈ కుంబాభిషేక కార్యక్రమాన్ని కార్తీక మాసంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞం యొక్క ఫలితం మనకు కనబడుతున్నదని, ముఖ్యమంత్రి ప్రయత్నానికి ఈ యాగ ఫలం తోడై ఎప్పటి నుండో కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఈ యజ్ఞం తదుపరి రాష్ట్రానికి వరదలాగా రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. తిరుపతి హథీరాం జీ మఠానికి ఫిట్ పర్సన్ని నియమించాలని రాష్ట్ర ధార్మిక పరిషత్ నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని దేవాదాయ భూముల పరిరక్షణకు దేశంలోనే విప్లవాత్మకమైన చట్ట సవరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర కేబినెట్ ఆమోదించిందన్నారు. కోర్టు అదేశాలకు అనుగుణంగా రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న దేవాలయాలకు ట్రస్టుబోర్డులు నియమించకుండా వాటి నిర్వహణ భాధ్యతను ఫౌండర్లకు, అర్చకులకు అప్పగించి మరియు వాటి పర్యవేక్షణా బాధ్యతను దేవాదాయ శాఖ అధికారులు చూసుకోవాల్సిఉందన్నారు. ఆలయాల ఆస్తులను అమ్మడం కాని, సొంతంగా లీజుకు ఇవ్వడం గాని నిర్వహకులకు ఉండదన్నారు. ఆలయాల ఆస్తులు ఆక్రమణకు గురైనా, లీజు పీరియడ్ అయిపోనా నిబంధలకు విరుద్దంగా కొనసాగుతూ ఉంటే దేవాదాయ శాఖ అధికారులే దాన్ని స్వాదీనం చేసుకొనే విధంగా చట్ట సవరణ చేయడం జరిగిందని తెలిపారు.

## నైరుతి వచ్చేసింది.. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం వారం తర్వాతే వర్షాలు!

**ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**

భారత వాతావరణ శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. నైరుతి రుతుపవనాలు ఇవాళే కేరళను తాకినట్లు అధికారికంగా ప్రకటించింది. అంతకు ముందు రేపు(శుక్రవారం) రుతుపవనాలు కేరళను తాకొచ్చని ఐఎండీ అంచనా వేసింది. అయితే.. ముందుగానే ఇవాళ చేరుకుంది. రుతుపవనాల రాక ప్రభావంతో.. రానున్న 48 గంటల్లో కేరళ, కర్ణాటక, తమిళనాడు సహా పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలుపడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో కాస్త ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని చెబుతోంది. వారం తర్వాతే అంతటా వర్షాలు ఉంటాయని పేర్కొంది. ఈ ఏడాది దోబూచులాడిన రుతుపవనాలు.. ఆలస్యంగా ప్రవేశించాయి. దక్షిణ అరేబియా సముద్రం మీదుగా పడమట గాలులు కొనసాగుతున్నాయి. అంతకు ముందు పశ్చిమ గాలుల లోతులో పెరుగుదల, ఆగ్నేయ అరేబియా సముద్రం, లక్షద్వీప్, కేరళ తీర ప్రాంతాలపై మేఘావృతం ఉధృతం కావడం వంటి పరిణామాలు కనిపించాయి. తెలంగాణలో మూడురోజులపాటు అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని తెలిపింది వాతావరణశాఖ. అయితే..



గురు, శుక్రవారాల్లో ఆదిలాబాద్, కొమరంభీం, మంచిర్యాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఏపీకి ఉపశమనం కాస్త ఆలస్యం కావొచ్చని అంచనా వేస్తోంది.

## మృగశిర కార్తె ప్రారంభం

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

ఈ కార్తె రోజు ప్రతి ఇంట్లో చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీని వెనుక ఆరోగ్య రహస్యం దాగివుంది. రోళ్లు పగిలే ఎండలను మోసుకొచ్చిన రోహిణికార్తె ముగిసి.. చల్లబరిచే మృగశిర మొదలవుతుంది. మృగశిర కార్తె అంటే.. ఆశ్విని మొదలుకుని రేవతి వరకూ మనకున్న 27 నక్షత్రాల్లో సూర్యుడి ప్రవేశం ఆధారంగా కార్తె నిర్ణయం జరుగుతుంది. భారతీయ జ్యోతిష్య సాంప్రదాయం ప్రకారం.. ఒక్కో కార్తెలో ఒక్కో విధంగా ప్రకృతిలో మార్పులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించి నాటినుంచి నైరుతి రుతుపనాలు వస్తాయి. వాతావరణం ఒక్కసారి చల్లబడటం, ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకునే నేపథ్యంలో అనేక రకాల చెడు సూక్ష్మక్రిములు వంటివి పునరుత్పత్తి అవుతాయి. మానవునిలో రోగ నిరోధకశక్తి తగ్గి జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయి. మృగశిర కార్తెలో చేపలు తినడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపించబడింది. చేపలు తినడం వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు, ఆస్తమా, మధుమోహ వ్యాధి ఉన్నవారు, గర్భిణులు ఈ సమయంలో చేపలు తింటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఈ నేపథ్యంలో మనిషి శరీరంలో మార్పులు జరిగి వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. గుండెజబ్బులు, ఆస్తమా తదితర అనారోగ్యసమస్యలు ఉత్పన్నమవుతాయి. వీటన్నింటికి అడ్డుకట్ట వేయాలంటే చేపలు తినాల్సిందే.

**అసలు మృగశిర కార్తెకు ఉన్న సంబంధం ఏమిటి..?**

వ్యాధుల నియంత్రణకు చేపలు మృగశిర కార్తె రోజు చేపలు ఎందుకు తింటారో తెలుసా..? రోకండ్లను సైతం పగులగొట్టే ఎండలు తగ్గిపోతాయి. వర్షాలు మొదలవుతాయి. 15 రోజుల పాటు ఈ కార్తె ఉంటుంది. మృగశిర కార్తె చేపలు తినడాన్ని మన పూర్వీకుల నుంచి ఆనాదిగా వస్తోంది. ఎండకాలం తర్వాత వాతావరణం చల్లబడటంతో మన శరీరంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఈ క్రమంలో వేడి ఉండేందుకు చేపలను తింటారు. దీని వల్ల గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. ఇదేకాక ఈ సీజన్‌లో చాలా మందికి జీర్ణశక్తితోపాటు రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంటుంది. జ్వరం, దగ్గు బారిన పడతారు. ఇలాంటి వాటి నుండి గట్టెక్కాలంటే చేపలు తినాల్సిందే.

పూర్వీకులు శాఖాపరమైన ఇంగువను బెల్లంలో కలుపుకొని ఉండలు.. ఉండలుగా చేసుకుని తినేవారు. మాంసాహారులైతే చేపలను ఇంగువలో, చింత చిగురులో పెట్టుకుని తినేవారు. ఈ రోజు ఏ ఇంటా చూసినా చేపల పులుసే. చేపల కూర వంటకాలే



కనిపిస్తుంటాయి. పులుసో, ఫ్రై చేసుకుని ఖచ్చితంగా తింటుంటారు. పంచాగ ప్రకారం ఆరుద్ర నక్షత్రంలో సూర్యుడు ప్రవేశించే సమయంలోని తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు, శకునాలు తదితర అంశాల ఆధారంగా చేసుకుని ఆ సంవత్సరం యొక్క వర్షాన్ని నిర్ణయించడం జరుగుతుంది. ఈ విధంగా వ్యవసాయదారులకు నిత్యజీవనోపయోగిగా, వ్యవసాయం పనులకు మార్గదర్శకంగా ఈ కార్తెలు ఉపయోగపడుతున్నాయి.

**పురాణగాధ ప్రకారం**

మృగశిరస్సు కలిగిన మృగవ్యాధుడు అను వృతాసురుడు వరప్రభావంచే పశువులను, పంటలను హరించి వేయడం ప్రకృతి భీభత్సాలాను సృష్టించడం, వర్షాలకు అడ్డుపడటం జరుగుతూ ఉండేడిది. ఇతను చనిపోకుండా అనేక వరాలు కలిగి ఉండటంచేత ఇంద్రుడు సముద్ర హాలల నుండి వచ్చే నురుగును ఆయుధంగా చేసి చంపేస్తాడు.

**ప్రకృతి మార్పు ప్రభావం**

ఈ కథ ఆధారంగా ఖగోళంలో ఇంద్ర నక్షత్రమైన జ్యేష్టాకు మృగశిరకు 180 డిగ్రీల దూరంలో ఉండటం వలన తూర్పు ఆకాశంలో ఇంద్ర నక్షత్రం ఉదయించగానే వృతాసుర నక్షత్రం అస్తమిస్తుంటుంది. ఇక్కడ నురుగు అనేది ఋతుపవనాలకు , వర్షాలకు సూచన. ఇంద్ర నక్షత్రమైన జ్యేష్ట ఉదయించినపుడు సూర్యుడు మృగశిరలోకి ప్రవేశించడం వలన మృగశిరకార్తె ప్రవేశిస్తుంది. వర్షాలు పడకుండా అడ్డుపడ్డ మృగాసురుని చంపిన ఇంద్రున్ని వర్షప్రదాతగా , వర్షదేవుడుగా పిలుస్తారు. ఇది కథ.

## రూ.500 నోట్ల రద్దుపై ఆర్బీఐ గవర్నర్ కీలక ప్రకటన..!



**న్యూఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**

నోట్ల ఉపసంహరణ, కొత్త నోట్ల ముద్రణపై రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం (జూన్ 8) కీలక వ్యాఖ్యలు చేశారు. రూ.500 నోట్ల ఉపసంహరించుకునే ఆలోచన లేదని స్పష్టం చేశారు. అలాంటి వదంతులు నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నోట్ల ఉపసంహరణ, కొత్త నోట్ల ముద్రణపై రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం (జూన్ 8) కీలక వ్యాఖ్యలు చేశారు. రూ.500 నోట్ల ఉపసంహరించుకునే ఆలోచన లేదని స్పష్టం చేశారు. అలాంటి వదంతులు నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే రూ.1000 నోట్లను తిరిగి ప్రవేశపెట్టబోమని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు.2024 ఆర్థిక సంవత్సరం కోసం రెండో ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని ఆవిష్కరించిన తర్వాత దాస్ ఈ మేరకు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా 2 వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకున్న నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ మాట్లాడుతూ.. రూ.500 నోట్ల ఉపసంహరణ, రూ.1000 నోట్లను తిరిగి ప్రవేశపెట్టడం గురించి ఆర్బీఐ ఎటువంటి ప్రకటన చేయలేదు. అటువంటి ఆలోచించన కూడా చేయడం లేదు. మొత్తం రూ.3.62 లక్షల కోట్ల రూ.2000 నోట్లు చలామణిలో ఉన్నాయి. వీటిల్లో దాదాపు రూ.1.82 లక్షల కోట్లు (50 శాతం) వెనక్కి వచ్చాయన్నారు. 85 శాతం నోట్లు డిపాజిట్ల రూపంలో తిరిగి వచ్చాయి. మిగిలినవి మార్పిడికి రావల్సి ఉందని దాస్ తెలిపారు. కాగా మే 19న ఆర్బీఐ చలామణి నుంచి రూ. 2,000 కరెన్సీ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-9 Pupulah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh.
Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email id: konduri9999@gmail.com